రచన - ఏప్రిల్, 1994

"మనిషి పాదరసంలా ఉంటూనే జీవితంలో నవరసాలూ పండించగలదు-"
*(ఈ కథకు ముగింపు జూలై, 1994 రచనలో 5వ పేజీలో 'అచ్చం నీలాగే' కింద ఉన్న ముగింపు)*

# పాదరసం

సీతమ్మంటే ఎవరో ముసలావిడ అనుకునేరు కనుక! ఇప్పటికింకా ఆమెకు పట్టుమని పాతికేళ్ళు లేవు. ఆమె పేరు "సీత". అయితే చిన్నప్పటినుంచీ అంతా సీతమ్మనే పిలిచేవారు.

తనకు లేని రోగాలు లేవని సీతమ్మ నమ్మకం. ఆ విషయంలో ఒక్కసారి కదిపి చూడండి, - యాభై రోగాల పేర్లూ, వంద మందుల పేర్లూ ఏకధాటిగా చెబుతుంది.

సీతమ్మ భర్త మోహన్ ట్రాన్స్‌ఫర్ మీద రాజమండ్రి వచ్చాడు. అక్కడ సీతమ్మ కజిన్ బలరాం ఉంటున్నాడు. అతడు మోహన్‌కు ఇల్లు వెదకడంలోనూ, ఇతరత్రానూ చాలా సాయపడ్డాడు.

ఇల్లు దొరికేక మోహన్ భార్యనూ, ఇద్దరు పిల్లల్నీ తీసుకుని వచ్చాడు. ఒకరోజున బలరాం వాళ్ళను తనింటికి భోజనానికి ఆహ్వానించాడు.

బలరాంకు సీతమ్మ చిన్నప్పట్నించీ తెలుసు. అప్పుడామె పుష్టిగా, బొద్దుగా, అందంగా ఉండేది. పెళ్ళయ్యాక అతడామెను ఇదే చూడడం. ఇప్పుడామె మనిషి పుల్లలా అయిపోయింది. మునుపటి అందంలేదు. అందుకు బలరాం ఎంతో బాధపడ్డాడు.

"ఏం చెప్పనండీ? వేలు తెగినా, కాలు బెణికినా, ఆఖరికి కంట్లో నలకపడినా దానికి మందు వాడాలంటుంది. ప్రతి చిన్న కంప్లయింటుకీ ఏదో రోగం పేరు చెబుతుంది. అదే తగ్గుతుందంటే వినదు. నేను వద్దన్నా తనే షాపుకి వెళ్ళి మందుకొని వాడేస్తుంది. తన వంట్లో రెజిస్టెన్సంతా పోయిందని నా అనుమానం" అన్నాడు మోహన్. అది పంజాయిషీలాగానూ లేదు, ఫిర్యాదులాగానూ లేదు....

"అలాగని వదిలేస్తారా? ఎలాగో చెప్పి చూడాలి" అన్నాడు బలరాం.

"మనిషి మొండిది. చెప్పి లాభం లేదు" అన్నాడు మోహన్.

బలరాంకు తను చాలా తెలివైనవాడినని అదో నమ్మకం. సీతమ్మకు చెప్పేలా చెప్పేవాళ్ళు దొరకలేదని అనుమానించి ఆ లోటు తీర్చాలనుకున్నాడు. వెంటనే భార్యతో మాట్లాడుతున్న సీతమ్మను పిలిచి, "ఏమే నీకు నా మాటంటే గౌరవముందా, లేదా?"

అన్నాడు.

సీతమ్మ నొచ్చుకున్నట్లు మొఖం పెట్టి, “అదేంటి అన్నయ్యా! నీ అడుగు జాడల్లోనే కదా నేనెప్పుడూ నడిచేది? ఆయన్నే అడుగు - నీ గురించి ఎంతలా చెబుతానో?” అంది.

“నేను టిఫిన్లు తినకుండా రోజూ పొద్దున్నే చద్దన్నం తింటున్నానిప్పటికీ! మరి నీ సంగతేమిటి?” అనడిగాడు బలరాం.

“భలే వాడివే - నేనూ అంతే! చిన్న పిల్లలా ఇంకా చద్దాన్నాలేమిటని ఆయన యింకా నవ్వుతూంటారు. అయినా నేను లెక్క చేయడం లేదు” అంది సీతమ్మ.

“మరి పత్రికలు చదువుతున్నావా, పురాణ కావ్యాలు చదువుతున్నావా?”

“ఆయన నన్ను అమ్మమ్మ అని వెటకారం చేస్తూనే ఉంటారు. అయినా సరే - నేను రోజూ భాగవతమే పారాయణం చేస్తుంటాను.”

బలరాం చాలా సంతోషించాడు. తనకున్న అలవాట్లే ఆమెకూ ఉన్నాయి. ఆ విషయం మరికొన్ని విశేషాలడిగాక ఇంకా రూఢి అయిపోయింది. అప్పుడతడు, “అదేమిటి మరి - పెళ్ళికి ముందు బొద్దుగా ఉండేదానివి - ఇప్పుడు పుల్లలా మారిపోయావు?” అన్నాడు బాధను గొంతులో ధ్వనింపచేస్తూ.

“ఏం చెప్పేదన్నయ్యా!” అంటూ తన బాధలు చెప్పుకుంది సీతమ్మ.

ఆమెకు తలనొప్పి. ఫలానా మందులు వాడినా తగ్గలేదు. మెడనొప్పి - ఫలానా మందులు వాడినా తగ్గలేదు. రొంప, ఇస్నోఫీలియా... అంటూ రకరకాల రోగాలపేర్లూ, వాటి మందులపేర్లూ చెప్పి తనకేవీ పనిచేయడం లేదందామె.

బలరాం ఓపికగా అన్నీ విని, “నేనైతే ఏం చేస్తానో తెలుసా? జ్వరమొస్తే దానంతదటే తగ్గుతుందని ఒక రోజాగుతాను. తలనొప్పి వస్తే అదే పోతుందని భరించి ఊరుకుంటాను. రొంప పడితే మిరియాల పాలు తాగుతాను. అజీర్ణం చేస్తే అల్లం తింటాను....” అంటూ పురాణం విప్పాడు.

సీతమ్మ అసహనంగా అతణ్ణి మధ్యలో ఆపి, “ఇదంతా ఎందుకు చెబుతున్నావు?” అంది.

“సాధారణంగా వచ్చే చిన్న చిన్న జబ్బులకు మన శరీరంలోని రోగ నిరోధక శక్తి సరిపోతుంది. ఆ పైన సరైన ఆహార పదార్థాలెన్నుకోవాలి. నేను దేనికీ మందులు వాడను. చాలామందులపేర్లు కూడా నాకు తెలియవు....” అంటూ బలరాం ఇంకా ఏదో చెప్పబోతూండగా....

“అచ్చం నీలాగే అన్నయ్యా నేనున్నూ! ఇంత సన్నంగా ఉన్నానా, నేనే మందులూ వాడను - ఆయన ఎంత బలవంతపెట్టినా అసలు ఆ మందుల పేర్లు కూడా తెలియవు నాకు” అంది సీతమ్మ.

✦ ✦ ✦